# చావు ప్యాకేజీ

రాత్రి మూడు గంటలప్పుడు సెల్ మోతకు మెలకువ వచ్చింది. దిండు కిందున్న ఫోన్ అందుకుని బద్ధకంగా, నిద్ర కళ్లతోనే "హలో" అన్నాను.

"మా అమ్మ చనిపోయింది. తొందరగా రండి" అవతల రఘు బావ గొంతు వింటూనే ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. నిద్రమత్తు పూర్తిగా వదిలింది.

"ఎప్పుడు జరిగింది" నా మాటలో కంగారు.

"రాత్రి పన్నెండు, ఒంటిగంట మధ్య నిద్రలోనే పోయింది" దుఃఖంతో ఆయన గొంతు పూడుకుపోయి ఉంది.

"మీరు కూడా నిద్రపోయిండొచ్చు" ఎలా ఓదార్చాలో తెలీలేదు నాకు.

"అవును. అందరం నిద్రలోనే ఉన్నాం. మధ్య మధ్య లేచి అమ్మకెట్లుందో చూసే అలవాటు నాకుంది. అట్ల లేచి ఇంతకు ముందే చూసిన. చూసేసరికి ఇది జరిగింది."

"మంచం లోంచి దించి కింద పడుకోబెట్టాలి కదా... నేనిప్పుడే బయల్దేరొస్తున్నా."

"ఆ పని చేసినం. మీరైతే తొందరగా రాండి."

"అందిరికీ ఫోన్లు చేశారా?" మంచం దిగుతూ అడిగాను.

"చేస్తున్న. మీరు బయల్దేరండి."

"ఒక్కగంటలో అక్కడుంట" బట్టలు మార్చుకోబోతూ చెప్పి, ఫోన్ కట్ చేశాను.

చెప్పినట్టుగానే గంటలో రఘు బావ వాళ్ల ఇంటికి చేరాను. అనంత లోకాలకు పయనించిన ఆమె పార్థివ శరీరం ఎవరూ తెలియనట్లు, ఏమీ ఎరగనట్లుంది. ఆమె జ్ఞాపకాలన్నీ చుట్టుముట్టాయి.



Scanned by CamScanner

"అందరికీ కబురందింది" చెప్పాడు రఘుబావ.

"ఇంకా జ్ఞాపకం చేసుకోండి. దగ్గరి వాళ్లందరికీ తెలపాలె కదా" అన్నాను.

"నాకేం తోస్తలేదు. మీరు ఆలోచించండి." బాగా ఏడ్చి అలిసినట్లు పీలగా ఉంది ఆయన గొంతు.

"ఎవరెవరికి చేశారో చెప్పండి. మిగతావాళ్లకు నేను ఫోన్ చేస్త. ఎవరికి చేయకున్నా వాళ్లు తప్పు తీస్తరు" నాకున్న అనుభవంతో మందలించాను.

"చావు విషయంలో కూడా తప్పులు లెక్కపెడుతరా?" ఆశ్చర్యంగా అన్నాడు.

"తప్పు పట్టడం తేలికైన పని. అందుకే చాలమంది ఆ పని చేస్తరు."

"నాకు మాత్రం ఏ ఆలోచనలు వస్తలేవు. మెదడంతా మొద్దుబారినట్టుంది" తల గోక్కుంటూ అన్నాడు రఘు బావ.

"ఇప్పుడు నీవు చేయాల్సిందేమీ లేదు. టైమ్ ఆరయింది. వచ్చినవాళ్లు పరామర్శిస్తరు" ధైర్యం చెబుతూ అన్నాను.

"ఇదంత ఎట్లా ఎల్లాలె?"

"అంతా సక్రమంగానే సాగుతది."

మెల్లమెల్లగా అందరు వచ్చిండ్రు. బంధువులు, తెలిసినవారు, చుట్టుపక్కల వాళ్లు... ఒక్కొక్కరే వచ్చి ఆమెకు సంబంధించిన జ్ఞాపకాల్ని కలబోసుకుంటున్నరు. నాలో ఆందోళన మొదలైంది. ఇంట్లో చేయాల్సిన పనులు చేశాను. కాని బయట చేయాల్సిన పనులపై నాకంత అవగాహన లేదు. ఇప్పుడవే ముఖ్యం. ఏమేం చేయాలో తెలిసిన వాళ్లున్నారు, కానీ చేసేవాళ్లు లేరు. ప్రదేశం కొత్త. చాతగాక కొంత. ఇల్లంతా శోక వాతావరణం, జరగాల్సిన కార్యక్రమం గురించి ఒకరిద్దరితో కలిసి ఆలోచించాను. సెల్‌ఫోన్ ద్వారా స్నేహితులతో చర్చించి అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లూ చేశాను.

గంట గంటకు ఇంట్లో మనుషుల సంఖ్య పెరుగుతోంది. "జాగ చూసి వచ్చిండ్రా" అని ఒకరు, "జల్దికానియ్యిండ్రి వానచ్చెటట్లున్నది" అని మరొకరు. "వచ్చెటోల్లందరు వచ్చిండ్రా?" ఒకరి సందేహం. తలా ఒక మాటతో వాతావరణం హడావిడిగా ఉంది.

"ఆమె ముక్కు చెవుల్లో దూది పెట్టండి. ఊదుబత్తీలు ముట్టించి పెట్టండి" ఎవరికి తోచిన మాటల్ని వారు చెబుతున్నరు. సానుభూతి వచనాలు, ఏడ్పులు, పరామర్శలు, పోయిన వ్యక్తి గుణగణాల ఏకరువు అంతా కోలాహలంగా ఉంది. అంత్యక్రియల ఘట్టం క్లిష్టమైంది. సెంటిమెంటు ఎక్కువ. మనిషిని పోగొట్టుకొని దుఃఖంతో ఉన్నవారు పనిచేయడానికి వీలులేని పరిస్థితి. కాని శవాన్ని కాట్లోకి పంపాల్సిన అగత్యం. నలుగురి అవసరం తప్పనిసరి. చురుగ్గా పనిచేయటానికి శుభకార్యం కాదనే తటపటాయింపు కొందరిది. ఆలోచనలతో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాను.

"ఏమోయ్ మనమడా, వానచ్చెటట్లున్నది. కాష్టం పేర్చుడయితుందా?" రఘుబావకు తాతయ్య వరసయ్యే ఒకాయన నన్నుద్దేశించి అడిగాడు.



Scanned by CamScanner

"ఆ ఏర్పాట్లు చేసెటోన్ని పిలిచిన"

"పాడె కట్టెటోల్లను పిలిచినవా?"

"అతనే కట్టిస్తడట.".

"అలంకరణ సామాగ్రి, బట్ట తెప్పిస్తున్నవా?"

"అతనొచ్చినంక ఆలోచిద్దాం."

అగో! గంత దండోడానోయ్ వచ్చెటోడు!"

"నాకు కూడా తెలియదు. మాఫ్రెండ్ పంపిస్తున్నడు."

"ఆయనేం పని చేస్తడు?"

"దహన సంస్కారాలు చేస్తడు."

"ఆ! కొత్తగ ఇంటున్ననోయ్."

ఇంతలో నా జేబులోని సెల్ మోగింది.

"హలో ... ఎవరు?"

"సార్, నేను శంకరయ్యను. మీ అడ్రసు చెప్పండ్రి."

"నీ కోసమే ఎదురుచూస్తున్న. తొందరగా రా" అంటూ శంకరయ్యకు రఘుబావ ఇంటికి రావడానికి దారి గుర్తులు చెప్పి ఫోన్ కట్ చేశాను.

"ఫోన్ చేసిందెవలోయ్?" మల్లీ ముసలాయన.

"ఎవరి గురించైతే మనం మాట్లాడుకుంటున్నామో ... అతనే."

కొద్దిసేపట్లోనే వచ్చాడు శంకరయ్య. పరిచయాలయ్యాయి. విషయాలు తెలిసాయి.

"ఆడా, మగా" అడిగాడతడు.

"కాటికి పోయేటప్పుడు కూడా తేడా ఉంటదా?" మధ్యలో మల్లీ ముసలాయన.

"ఎవల్లకు తెచ్చేవి వాల్లకు తేవాలె. అన్నీ నేను చూసుకుంట. ప్యాకేజీ ఉంది"

"ఎంతో చెప్పు?"

"6,800 రూపాయలకు ఒక ప్యాకేజీ. 7,200 రూపాయలకు మరో ప్యాకేజీ ఉంది."

"అబ్బ గంతనా. ఇంకో మాట చెప్పు" రఘుబావ తరపున బేరం చేస్తున్నడు ముసలాయన.

"ధరలు కాష్టం లెక్క మండుతున్నాయి. మేం బతుకద్దా సార్"

"అంత గనం ఏం తీసుకస్తవు?" విస్మయంగా అడిగాడు ముసలాయన.

"మనిషి బరువును బట్టి కట్టెలు పెట్టాలె. అగర్‌బత్తీలు, కిరసనాయలు, టైర్లు, పసుపు కుంకుమ, బుక్కగులాలు, సెంటు, పన్నీరు, ముత్యం, పగడం, బంగారుపూస, గంధపుచెక్కలు,



Scanned by CamScanner

పేలాలు, చిల్లర పైసలు, పైన తెల్లబట్ట, చీర, దండలు, పాడె బొంగులు, కుండ, సుతిలి, వ్యాను, చప్పుళ్లు..."

"ఆగాగు. నీవు చెప్పినంత ఇస్తం. ఏదీ తక్కువ కాకుండ ఏది కావాల్నన్నా నన్ను అడుగు" మధ్యలో చొరబడుతూ అన్నాను నేను.

"కాష్టం ఎక్కడ పేరుస్తవు?" ముసలయ్య ప్రశ్న.

"మానేరు డ్యాం కట్ట కొసకు."

"అంత దూరం ఎందుకయ్యా?" ముసలయ్య గొణిగాడు.

"మీరు నడిసేది ఏమన్న ఉన్నదా? వ్యాన్‌ల పోవుడేనాయె."

"నడీ డ్యాం కట్టకు దగ్గరనే ఇల్లుండె. కొసదాగ పోవుడెందుకు?" ముసలయ్య అసహనం ప్రదర్శించాడు.

"స్నానాలు చేయరా?"

"డ్యాంల నీళ్ళు లేవా..." నేను కలుగజేసుకున్నాను.

"డ్యాం కట్ట దిగినాంక రెండు కిలోమీటర్ల దూరం పోతే నీళ్ళు. అదే కట్ట కొసకైతే మున్సిపాలిటి వాల్లు నల్లాలు ఫిట్ చేసింద్రు. కాలపెట్టినాంక, అక్కడనే స్నానాలు చేసి రావచ్చు."

"సరేనయ్య. అక్కడనే పేర్చు. అక్కడికే పోదాం. నువ్వయితే పోయి పని చూడు."

"వచ్చెటోల్లు అందరూ వచ్చింద్రా సార్?"

"అందరూ వచ్చింద్రు. నీదే ఆలస్యం. తొందరగ పో."

"డ్యాంల నీళ్లే లేకుంట అయినయా?" అని ముసలయ్యనడిగాను.

"వర్షాలే లేకపాయె నీళ్లెట్లుంటయ్! ఉన్న నీళ్లను కాల్వదీసి వరంగల్‌కు, పైపులతోటి సిద్దిపేటకు మల్లియ్యవట్టిరి. కరీంనగరోల్లు దూపకుసచ్చే యాలచ్చింది."

"బాబ్లీ నిర్మాణాన్ని మహారాష్ట్ర పూర్తి చేస్తే ఉత్తర తెలంగాణా మొత్తం ఎడారి అయితది. సాగు నీరు లేక పంటలు పండయి. శ్రీరాంసాగర్‌లో సైతం నీటి లెవల్స్ తగ్గినాయి" నా మనసులో మాట అప్రయత్నంగా బయటపడింది.

"రోజిడిసి రోజు రెండు గంటలు వచ్చే నల్ల, ఇప్పుడు గంటకూడా వస్తలేదు. తాగునీరు లేక చస్తున్నంరా దేవుడా అంటే, సాగునీరు గురించి మాట్లాడవడితివి "రాజకీయనాయకులందరు డ్యాంల దిగి క్రికెట్ ఆడుతున్నరు" అంటూ ముసలయ్య కోపంగా వెళ్ళిపోయాడు.

ఇంతలో "సార్, అన్నీ తయారైనయి. మీదే ఆల్సెం. ముందుగాల కట్టకొసకు కట్టె ఏసివస్తె, వాళ్ళు కాడు పేర్చుతరు." అంటూ శంకరయ్య వచ్చాడు.

ఆ మాటతో నాలో తొందర మొదలైంది. రోదనలతో అంతా అచేతనంగా ఉన్నారు. వాళ్లలో కొందరిని పిలిచి, ఇంట్లో జరగాల్సిన సంప్రదాయ కార్యక్రమాలు చేయమని


Scanned by CamScanner

చెప్పాను. కట్టె వేసి రావడానికి కొడుకు వెళ్లాడు. కాసేపట్లోనే ఇంటి ముందు మాదిగ డప్పులు మోగాయి. పాడె సిద్దమయింది. వాతావరణంలో మార్పు వచ్చింది.

"ఏందయ్యా బీరిపోయి సూత్తండ్రు. ఆమెకు తానం చేయించాలే. లావట్టి కుర్చీల కూసోబెట్టుండ్రి. మొగోల్లంత ఏం చేస్తుండ్రు" శంకరయ్య తొందరపెట్టాడు.

ఐదారుగురు కలిసి ఆమెను కుర్చీలో కూర్చుండబెట్టారు. ఆత్మీయంగా తడిమి నీళ్లు పోయడానికి చేతులు వెనకాడాయి. సన్నిహితంగా వచ్చి అలంకరించడానికి అవయవాలు ఆలసించాయి. జీవకళతో సహవాసం చేసిన మనుషులు, ప్రేతకళకు కదూరంగా ఉంటారనే విషయం రుజువయింది. ఇదంతా గమనించిన శంకరయ్య చొరవతో వచ్చి మనిషికి చీర చుట్టి, పాడె పై పడుకోబెట్టాడు, మిగతావారు సహకరించారు.

"అమ్మా! ఒక్కొక్కలు వచ్చి పూలదండలు ఏసి మొక్కుండ్రి. వరుసగ రాండ్రి" అంటూ పూలదండలు ఇచ్చాడు. "ఎవ్వలు ఏడ్వద్దు. ఏడిస్తే ఆమె ఆత్మఘోషిస్తది" అంటూ బుక్కా గులాలు చల్లాడు. బియ్యం మూట కట్టి పాడెపై పెట్టి "ఈమెకు ఈ రోజుకు నూకలు చెల్లినయ్" అంటూ మొక్కాడు. అందరిచేత మొక్కించాడు.

రకరకాల తత్వాలు పాడుతూ ఏడ్పులను ఆపాడు. తాను ముందుండి శవయాత్రను పూర్తి చేశాడు. తర్వాత అందర్నీ తీసుకెళ్లి ఇల్లు చేర్చాడు. ఏమాత్రం శ్రమ లేకుండా, పెద్ద భారం దించుకున్న తృప్తి అందరిలోనూ కనిపించింది. అందరి నోళ్లు శంకరయ్యను ప్రశంసించాయి. ఒక ఘట్టం ముగిసింది. ఉదయం ఐదింటి నుండి పగలు రెండింటి వరకు క్షణం తీరిక లేకుండా తిరిగిన నా శరీరం కుర్చీలో కూలబడింది. సలహాలు ఇస్తూ, తీసుకుంటూ ప్రతి క్షణం జాగరూకతతో కదిలిన నా మెదడు కుర్చీలో సేద తీరింది. కళ్లు వాటంతటవే మూసుకున్నాయి.

"సార్! నేను పోత, నాకు వచ్చేటియి ఇయ్యుండ్రి" అనే మాట వినపడింది.

కళ్లు తెరిచి చూశాను. ఎదురుగా శంకరయ్య అతణ్ణి పరిశీలనగా చూశాను. శాగవారిన శరీరం. జీవకాంతులు నల్లటిరంగు ధరించి అతనిలో కనిపించాయి. అత్యంత సాధారణమైన డ్రెస్సింగ్ అతని పేదరికాన్ని చాటుతోంది. ఉదయం నుండి ఏమి తినని నా కడుపులో ఎలుకలు పోటీ పడి పరుగులు తీస్తున్నాయి. అతన్ని ఊరకనే పంపించాలనిపించలేదు.

"శంకరయ్యగారూ, ఏం తిందామో చెప్పండీ."

"ఇప్పుడు మీ తోటి స్నానం చేసిన కదా. ఇంటికి పోయినంక నీల్లల్ల పసుపు, చింతపండు రెక్క ఏసి తలంటి స్నానం చేస్త, తరువాత గాయత్రికి ఐదు బొట్లు పెట్టి, పూజ చేసి కొత్త జంధ్యం వేసుకుంట. అప్పుడు ఏదైన తింట. అంతవరకు తిన, కావాలంటే చాయ్ తాగుత."

"మీది ఏ కులం?"

"కోమటోల్లం"

"కిరాణం" షాపు పెట్టుకొనుడో, దాంట్ల పనిచేసుడో చెయ్యాలెగాని నువ్వు గీ పనికి ఎందుకు పూనుకున్నావు?"

"ఇది మాత్రం పనికాదా? వ్యాపారం కాదా? మనిషి కోసం ఏదో ఒకటి చేయాలనే కోరికతోటి ఈ పనికి పూనుకున్నా. ఇంట్ల వాళ్లు వద్దన్నా కూడా వినలె."



Scanned by CamScanner

"ఈ వ్యాపారమే ఎందుకు చేయాలనిపించింది?"

"మొదట్ల నేను అర్యవైశ్య సేవా సంఘానికి చెందిన టెంట్ హౌజ్‌ల పని చేసిన. శుభకార్యాలకు, దహన సంస్కారాలకు సామాను ఇస్తుండెటోడ్ని. ఇచ్చిన ప్రతి ఐటమ్ రాసేది. తర్వాత డబ్బులు వసూలు చేసేది. అట్ల ఏ కార్యానికి ఏమేం పడుతయో తెలిసింది. సంఘం టెంట్‌హౌస్ తీసేసింది. నేను రోడ్డు మీద పడ్డ. ఏం చేయాలన్నా పెట్టుబడి కావాలె. ఆక్సిడెంట్ అయిన నా రెండు కాళ్లకు లక్ష కావాలన్నరు. పైసలు లేక చేయించుకోలె. ఇగ నేను ఏం పెట్టుబడి పెట్టి వ్యాపారం జేస్త. ఇద్దరు బిడ్డలు. ఒక కొడుకు, సంసారం ఈదాల్నాయె. ఏం చేస్తే మంచిగుంటది అని బాగ ఆలోచించిన. సావులకు ముందుండి అన్నీ సరఫరా చేసేటోల్లు కనపడలేదు. అదే వృత్తిగా పెట్టుకొని బతుకుతున్న."

"ఖర్చులు పోను నీకు ఏపాటి మిగులుతాయి. మనిషి చచ్చి వాళ్లంత పరేషాన్ల ఉంటే నువ్వు పైసలు ఎట్ల వసూలు చేస్తవు?"

"శవం అక్కడుండంగనే, చచ్చిన మనిషిని మర్చిపోయే కాలం ఇది. మల, మూత్రాల మధ్య చచ్చినోళ్లను చూసిన. అసహ్యంతోటి కాళ్లు కడగటానికి కొడుకులు ముందుకు రాకపోతే నేను ముట్టుకొని కడిగి చూపించిన. శవం కాల్లు కడిగితే పుణ్యం. అన్నదమ్ములు కొట్లాడుకొని కుండ పట్టకపోతే, నేను పట్టిన. కుండ పడితె ఒక యాగం చేసిన పుణ్యం. ఇవ్వన్ని చేయకున్నా నాకు వచ్చే పైసలు వస్తయి. చేస్తే పది మందికి చేసిన తృప్తి మిగులుతది. అందుకే నన్ను అందరు పిలుస్తరు. నాకు ఓపిక తప్ప కోపం లేదు. ఇంత చేసినా కొంత ఎగ్గొట్టేటోల్లు ఉంటరు. వ్యాపారం అన్నాక నష్టం ఉంటది కదా అని సమాధాన పడుత".

"నీకు భయం, అసహ్యం... వెనకా ముందూ ఏమీ లేనట్లున్నయి."

"ఎట్లుంటయి. ఒక్కోసారి రోజుకు నాలుగు శవాలకు దహన సంస్కారం చేస్త. లేని నాడు వట్టిగనే ఉంట. అలవాటయింది. ఉరి వేసుకున్నోన్ని ఉరి ఇప్పి పండవెట్టిన. నాలుకను చూసి భయపడ. పోస్ట్‌మార్టమ్ అయి వచ్చిన శవం వాసన భరిస్త. వాసన అలవాటయింది. కొంతమంది కళ్లు దానం చేస్తరు. చచ్చినంక ఆరుగంటల లోపల ఆ పని చేయిస్త. ఒక్కోసారి శవం ఉన్న ఇంట్లో పెద్ద మనుషులు ఏవలు లేకపోతే దగ్గరుండి అన్ని పనులు చేయిస్త. నేను తీసుకున్న ప్రతీ పైసకు న్యాయం చేస్త."

అతను చెప్పే మాటలు ఆసక్తిగా అన్పించి

"ఈ వ్యాపారంలో నీకు ఎదురైన అనుభవాలు చెప్పు" అంటూ సంభాషణ పొడిగించాను.

"ఇప్పుడివన్నీ ఎందుకు? ఇంట్ల నీకు పని లేదా?"

"ఇంట్ల భోజనాల కార్యక్రమం జరుగుతున్నది. నువ్వు తినమంటె తినకపోతివి. కనీసం టీ అయినా నీతో కలిసి తాగుదామని వచ్చిన. నీ కేమన్న తొందర పని ఉన్నదా?"

"ఇగ ఇప్పుడు నాకేం పని లేదు" నవ్వుతూ అన్నడు.

"నిన్ను చూస్తే సంతోషంగా ఉంది. అందుకే నీ అనుభవాలు తెలుసుకోవాలనుకుంటున్న."



Scanned by CamScanner

"మనిషి ఆనందాన్ని పంచుకోవడం కన్న, ఆపదను పంచుకోవడం మిన్న. రేపు నేను చస్తే నా కోసమైతే పదిమంది వస్తరు అనే నమ్మకం ఉంది."

"కొందరు బతికుండగానే, సమాధులు నిర్మించుకుంటున్నారు. వాళ్ల గురించి ఏమంటవు?"

"అది మూర్ఖత్వం. చచ్చిన చోటునుండి లేపడానికి మనుషులైతే కావాలి కదా."

"నువ్వు అన్ని మతస్తుల కార్యక్రమాల్ని చేసినవా?"

"లేదు. ఒక్క హిందూ మతస్తులవి మాత్రమే చేసిన. అయితే అన్ని కులాల వాళ్లవి చేసిన. శివ మతస్తులు శవాన్ని కూర్చుండబెట్టి సమాధి చేస్తరు. హిందూ మతస్తుల్లో పెండ్లి కాని వాళ్లను బొందపెడుతరు. గజంన్నర లోతు తీసి కింద రెండు బస్తాల ఉప్పుపోసి శవాన్ని కూర్చోబెడుతరు. తరువాత మళ్లీ ఉప్పు పోసి, మట్టి కప్పుతరు. ఎడమచేత పిడికెడు ఉప్పు, మట్టి అందరు ఏసినాంక పూర్తిగా కూడుపుతరు. శవానికి జిల్లెడు కొమ్మతో పెండ్లి జరిపితే పెండ్లి అయిన వాళ్లలాగ కర్మకాండ జరుపుకోవచ్చు. అట్ల చేసే వాళ్లు కొందరు. మనిషిని కాలపెట్టేటప్పుడు కొందరు బోర్ల పండపెడితే, కొందరు వెల్లకిల పండపెడుతరు. రకరకాలుగ చేస్తరు."

"ఎవరైనా పిలిచినపుడు నువ్వు పోని సందర్భం ఉందా?"

"పోకపోవుడు ఉండదు. నా వృత్తే అదాయె. చాతగాక పోతే తప్ప పోకుండా ఉండ. అప్పుడు వాళ్లు బాధ పడుతరు. నువ్వు అన్నదానికంటె ఎక్కువ డబ్బు ఇస్తం అని నిష్ఠూరంగా మాట్లాడిన వాళ్లు కూడా ఉన్నరు.

డబ్బు మాట వచ్చేసరికి, నేను అతనికి ఇవ్వాల్సినవి యాదికి వచ్చినయి. తీసి ఇచ్చాను. "ఇగ పోత సార్" అంటూ లేచాడు.

"మొత్తానికి నీ పరిచయం తృప్తి నిచ్చిందయ్యా"అంటూచేతులు జోడించాను.

"అయ్యో! అదేంది సారు. లోకంల పాపాల సంఖ్య ఎక్కువైంది. పైన స్వర్గం, నరకంల జాగ లేదు. కనుక ప్రతీ ఒక్కరు భూమి మీదనే శిక్ష అనుభవిస్తున్నారు. ప్రతి చావులో నేను ఇది గమనించిన" అంటూ తన విజిటింగ్ కార్డు ఇచ్చి వెళ్లాడు.

Scanned by CamScanner